క్లుప్తంగా

పరీక్ష కేంద్రం తనిఖీ

భామిని: మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సోమవారం పరిశీలించాయి. ఏపీ మోడల్ స్కూల్, బత్తిలి జెడ్పీ పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షల తీరుపై ఆరా తీశాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్లు ఆర్.వెంకటరమణ, కె.వెంకటరావులను స్క్వాడ్ సభ్యులు డిప్యూటీ డీఈఓ జ్ఞానప్రకాష్, తహసీల్దార్ బి. స్వర్ణలత ఆదేశించారు.

నేడు దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



కోటదుర్గమ్మ

వీరఘట్టం: మండల కేంద్రంలో గల కోటదుర్గ ఆలయ రెండో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

సీతంపేట: దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు అన్నారు. వరల్డ్ డెంటల్ హెల్త్ డే సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు పూటలా బ్రష్ చేసుకోవాలన్నారు. గుట్కాలు, ఖైనీలకు స్వస్తి పలకాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించండి

- ఎంపీడీఓ వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యదర్శులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్, ఏపీఓ సత్యంనాయుడు పాల్గొన్నారు.

కార్మికుల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

పార్వతీపురం: వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల రక్షణకోసం సంబంధిత యజమానులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉప కార్మిక కమిషనర్ డీవీ.ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల కారణంగా వివిధ సంస్థలు, దుకాణాలు, పరిశ్రమలు, భవన నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన తాగునీరు, పనిచేసే చోట నీడ ఉండేలా వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని యజమానులకు సూచించారు.

వేసవిలో కడుపు చల్లగ..



తాటి ముంజులు, పనస తొనలు

- తక్షణ శక్తికి తాజా పండ్లు, కూరగాయలు..
- తాటి ముంజెలు, అరటి, కొబ్బరి బొండాలు మేలు
- డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి



భామిని: కొద్ది రోజులుగా ఎండలు మండుతున్నాయి.. ఎండ తీవ్రతకు శరీరంలో నీటి శాతం తగ్గుతోంది.. దీంతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో ఇంటి నుంచి బయటకు అడుగు వేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో వేసవి తాపాన్ని తట్టుకోవడం, వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు అందుబాటులో ఉండే తాజా పండ్లు, కూరగాయలు ఎంతో మేలని వైద్యులు సూచిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు, రుతువుల బట్టి లభించే పళ్ల రసాలను తీసుకోవడంతో ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నారు. పండ్లు, కూరగాయలు చవకగా లభించడం, కల్తీకి అవకాశం లేకపోవడంతో అధిక పోషకాలు అందుతాయి. ప్రమాదం ఏర్పడిన తర్వాత కన్నా ముందుగానే నివారణ చర్యల్లో భాగంగా పండ్లు, కూరగాయలు తీసుకోవడం మేలని వైద్యులు చెబుతున్నారు.

ఎన్నో పోషకాలు..

- ఏజెన్సీలో పండే పంటలతో ఎండల నుంచి ఉపశమనం పొందవచ్చు. ప్రధానంగా కొబ్బరి నీరు, తాటి ముంజలు, ఖర్బూజాలు, నిమ్మకాయలు, ఆరంజ్, అరటి పళ్లు, చెరుకు రసం, బొప్పాయి, మామిడి పళ్లల్లో పోషకవిలువలు మెండు.
- సహజ సిద్ధంగా లభించే ఉసిరి, నేరేడు, పనస, ఈత, వెలగ పండ్లు విధిగా తినాలి.
- గుమ్మడి, దొండ, చిక్కుడు, మునగ, క్రపెండలం, చిలగడ దుంపలు, కంద, చామ దుంపలు తినడం వల్ల కడుపు చల్లగా ఉండడంతో పాటు ఎండ వేడి నుంచి తట్టుకునే శక్తి వస్తుంది.
- దేశవాళీ పంటలు తీసుకోవడం వల్ల చర్మ, ఇతర వ్యాధులు రావు.
- తాజా పండ్లు, కూరగాయల్లో విటమిన్లు, ఖనిజ లవణాలు, ఎంజైమ్‌లు పుష్కలంగా ఉంటాయి.
- కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవాలి. ఇందులో పొటాషియం, గ్లూకోజ్ ఉండడంతో వడదెబ్బ నుంచి బయట పడవచ్చు.
- చిలగడ దుంపలో ఫైబర్, పోటాషియం, ఐరన్, బీటా కెరోటిన్ ఉండడంతో త్వరగా ఆకలి వేయదు.
- బొప్పాయిలో యాంటీ ఆక్సిడెంట్లు, కాల్షియం, పోటాషియం, ఏ,సీ,బీ,సీ,కే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- నేరేడు పండ్లలో విటమిన్ బీ 6, సీ,కే విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. శరీరంలో పలు మార్పులకు తావిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంతో శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి.

వడదెబ్బ నుంచి రక్షణ పొందాలి..



వేసవి తీవ్రత పెరిగే సమయంలో అందుబాటులోని పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు తాగి వడదెబ్బ నుంచి రక్షణ పొందాలి. తాటి ముంజులు కూడా చాలా మంచివే. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. శరీరంలో నీటిశాతం శాతం తగ్గకుండా చూసుకోవాలి. వడదెబ్బకు గురైన వారికి దాహానికి ఏమైనా ఇచ్చి నీడ ప్రాంతంలో ఉంచి గాలి తగిలే విధంగా చూడాలి. అత్యవసర పరిస్థితితో వైద్య సేవలు పొందాలి. –డాక్టర్ కె.విజయ పార్వతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ, సీతంపేట

చిత్తడిగా ఏబీ రోడ్డు



పసుకుడి - సింగిడి వద్ద ఏబీ రోడ్డు

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు మళ్లీ చిత్తడిగా మారింది. ఆదివారం రాత్రి కురిసిన చిరుజల్లులకు రోడ్డంతా చిత్తడిగా మారడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అసలే రోడ్డంతా గోతులమయం కావడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో చిరు జల్లులు కురడంతో గోతులన్నీ నీటితో నిండిపోయాయి. భామిని నుంచి గురండి.. పసుకుడి నుంచి సింగిడి..సింగిడి నుంచి నుకలజోడు మధ్య రోడ్డు మరీ అధ్వానంగా మారింది.అలాగే ఘనసర వద్ద రోడ్డంతా గోతులతో దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రీ సర్వే వేగవంతం



సర్వే టీమ్ తో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: మండలంలో చేపడుతున్న రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు.సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సర్వే టీమ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇంతవరకు చేపట్టిన సర్వే వివరాలను ల్యాప్‌టాప్‌లో పరిశీలించారు. అయనతో పాటు సర్వే డీటీ ప్రసాదరావు ఉన్నారు.

రెగ్యులర్ ఉద్యోగులను నియమించండి

గుమ్మలక్ష్మీపురం: స్థానిక సచివాలయంలో రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు కోరారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, అగ్రికల్చర్ అసిస్టెంట్, సచివాలయ లైన్‌మేన్ పోస్టుల విధులను గత కొన్ని నెలల నుంచి ఇన్‌చార్జ్‌లతోనే నిర్వహిస్తున్నారని, దీంతో ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదన్నారు. గ్రామ రెవెన్యూ సర్వేయరును కూడా తహసీల్దారు కార్యాలయానికి పరిమితం చేశారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, శాశ్వత ఉద్యోగులు సచివాలయంలో విధులు నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పరామర్శ..





పాలకొండ: పద్మావతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు (ఇన్‌సెట్లో)
వీరఘట్టం: సొంట్యాన సింహాచలంతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని మారోజు పద్మావతి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కౌన్సిలర్లు సోమవారం పరామర్శించారు. పద్మావతి ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. పరామర్శలో పార్టీ నాయకులు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, కోరాడ సూర్యనారాయణ బాబు, తుమ్మగుంట శంకరరావు, పాలవలస ధవళేశ్వరరావు తదితరులు న్నారు.

యు. వెంకమ్మపేటలో..

వీరఘట్టం: మండలంలోని యు.వెంకమ్మపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సొంట్యాన సింహాచలం తల్లి త్రినాథమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు గ్రామానికి చేరుకుని సింహాచలంను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వారాడ శ్రీరాములనాయుడు, తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐసీడీఎస్ పరిధిలోని పార్వతీపురం మున్సిపాల్టీలో రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురంలోని రెల్లివీధి 25వ వార్డులో ఎస్సీ కేటగిరికి ఒకటి, 4వ వార్డులో బీసీ–డీ కేటగిరికి ఒకటి కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హులైన వివాహిత మహిళలు దరఖాస్తులను మార్చి 31 సాయంత్రం 5 గంటల లోగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పార్వతీపురం కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుదారులను మాత్రమే ఇంటర్వ్యూకు పిలవనున్నట్లు స్పష్టం చేశారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం త్వరలో తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ సహాయకులకు జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. మరిన్ని వివరాలకు పార్వతీపురం ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

- రూరల్ ఎస్సై బి.సంతోషి

పార్వతీపురం రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు. ఈ మేరకు పార్వతీ పురం మండలంలోని పెదబొండపల్లి గ్రామం లో తామర చెరువు వద్ద రహదారికి ఇరువైపులా ఉన్న పొదలను, డొంకలను సోమవారం జేసీబీతో తొలగించి మట్టిని సరిచేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మలుపుల వద్ద వాహన చోదకులు సురక్షితంగా ప్రయాణించేందుకు రోడ్డుకు ఇరువైపులా డొంకలు, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నట్లు చెప్పారు.

వైద్య మిత్రల శాంతియుత నిరసన

పార్వతీపురంటౌన్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యమిత్రలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద వైద్యమిత్రలు శాంతియుత నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్యమిత్ర నిమ్మకాయల రాజ్ కమల్ మాట్లాడుతూ గత 17 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా జీవో నంబర్ 28 రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రమాదాలు జరిగితేనే నిర్లక్ష్యం వీడుతారా?

పార్వతీపురం రూరల్: మండలంలోని పులిగుమ్మి రహదారిపై ప్రయాణం అడుగడుగునా గుంతలతో నరకాన్ని తలపిస్తోంది. శిథిలావస్థకు చేరిన రహదారిపై రాళ్లు తేలి గుంతలు ఏర్పడడంతో తరచు వాహనదారులు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తట్ట మట్టి పోసిన పాపాన కూడా పోలేదు. భారీస్థాయిలో ప్రమాదాలు జరిగితేనే అధికారులు నిర్లక్ష్యం వీడుతారా? అంటూ సంబంధిత అధికారుల తీరుపట్ల వాహన చోదకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్యాచ్‌వర్కులు చేపట్టి అయినా రహదారిని సురక్షితంగా ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

సారా కేసుల్లో ఆరుగురిపై బైండోవర్

సీతానగరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సర్కిల్ పరిధిలో ఉన్న గరుగుబిల్లి మండలంలో సారా కేసుల్లో పట్టుబడిన ఆరుగురు నిందితులపై గరుగుబిల్లి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ కేసులు పెట్టినట్లు సీఐ డి.పద్మావతి ఒక ప్రకటనలో సోమవారం తెలియజేశారు. బైండోవర్ కేసులో ఉన్న నిందితులు ఒక సంవత్సరం కాలంలో మళ్లీ సారా కేసుల్లో పట్టుబడితే లక్ష రూపాయల జరిమానాతో పాటు ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు.

తుప్పల తొలగింపు ..



సీతంపేట మండలంలో కిట్టాలపాడు జంక్షన్ నుంచి గొయిది వరకు రోడ్డుకిరువైపులా ఉన్న తుప్పలను స్థానిక పోలీసులు సోమవారం తొలగించారు. తప్పలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునేవి. ఈ నేపథ్యంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు ఎస్సై వై. అమ్మన్నరావు తెలిపారు. - సీతంపేట

ఉద్యోగోన్నతి..



సీతంపేట మండల కేంద్రంలోని బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చింతాడ నల్లయ్యకు పీజీ హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా సోమవారం ఉత్తర్వులు అందుకున్నారు. పొల్లలో పీజీహెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో ఈయన పీఎంఆర్‌సీ విభాగంలో సీఎంఓగా పనిచేశారు. ఈ మేరకు నల్లయ్యను పలువురు అభినందించారు. - సీతంపేట

ఆక్రమణలపై డీఆర్‌వోకు ఫిర్యాదు



డీఆర్‌వో హేమలతకు ఫిర్యాదు చేస్తున్న తోటపల్లి గ్రామ మహిళలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ భూముల ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై, డీఆర్‌వో కె.హేమలతకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఆలయ ఆవరణలో కొంతమంది అక్రమార్కులు అక్రమంగా నిర్మాణాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ నిర్మాణాల వల్ల భక్తులకు అసౌకర్యం తలెత్తుతోందన్నారు. ఆక్రమణలపై సర్వే చేసి, ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దారును డీఆర్‌వో ఆదేశించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సరళ, ఉమామహేశ్వరి, సునీత, పార్వతి, పద్మ తదితరలు ఉన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి



గుమ్మలక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఈఓ తిరుపతినాయుడు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్(బాలురు), ఏపీ టీడబ్ల్యూఆర్(బాలికలు) పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతినాయుడు సోమవారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఇదిలా ఉండగా, మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దారు ఎన్.శేఖర్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు.

పోక్సో చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్యజాస్పిన్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని పూతికవలస గ్రామంలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పోక్సో చట్టంపై సోమవారం అవగాహన కల్పించారు. చట్టం గూర్చి కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్యజాస్పిన్ తెలిపారు. 18 ఏళ్ల వయసులోపు బాలికలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకే ఈ చట్టం చేయడం జరిగిందని, ప్రధానంగా 12 ఏళ్ల వయసు కన్నా తక్కువ వయసున్న బాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామ్‌ప్రసాద్, జి.రాజ్‌కుమార్, ట్రైనీ ఎస్ఐలు పి.శ్రీనివాసులు, శ్రావణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల పట్ల అప్రమత్తం



ప్రతిజ్ఞ చేస్తున్న రేగులపాడు కేజీబీవీ బాలికలు

వీరఘట్టం: బాల్య వివాహాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ సూచించారు. మండలంలోని రేగులపాడు కేజీబీవీలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. రక్తహీనతను అధిగమించేందుకు సరైన మోతాదులో పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం బాల్య వివాహాలకు దూరంగా ఉంటామని బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఓ డి.ఉషా రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భామిని: మండలంలోని లివిరి, గురండి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ జి.శాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోగా సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. లివిరి హెల్పర్ పోస్టు ఎస్సీలకు.. గురండి హెల్పర్ పోస్టు ఓసీలకే కేటాయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన



పట్టణంలోని రామ కళామందిర్ సచివాలయంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో స్థానిక మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శి బలివాడ సంధ్య ఆధ్వర్యంలో యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. - పాలకొండ

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



జియ్యమ్మవలస: క్షయవ్యాధి నియంత్రణపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



గరుగుబిల్లి: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

గరుగుబిల్లి: మండల కేంద్రంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ సోమవారం చేపట్టారు. ప్రపంచ క్షయ నివారణ దినంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్.. వ్యాధి లక్షణాలు, వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా వ్యాధి లక్షణాలతో బాధపడితే తక్షణమే ఆస్పత్రిలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఎడతెరిపిలేని దగ్గు ఉంటే వెంటనే కెల్ల పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడ మందులు ఉచితంగా అందివ్వడంతో పాటు ప్రతినెలా రూ.వెయ్యి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కింద వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కూడా అందజేయడం జరుగుతుందన్నారు.

జియ్యమ్మవలస: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినంలో భాగంగా మండల కేంద్రంలో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న.. వ్యాధి లక్షణాలు, దాని నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వ్యాధి నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు.